# తృప్తి

రామ్మూర్తి అతి నెమ్మదిగా నడుస్తున్నాడు. దారికి ఇరువైపులా వున్న యిళ్ళ గుమ్మాలను పట్టుకుని అసభ్యమైన సైగలుచేస్తున్న అమ్మాయిల మొఖాల్లోకి పరిశీలనగా చూసుకుంటూ నడుస్తున్నాడు.

"వస్తావా" రోడ్డువారగా నిలబడి వున్న ఓ స్త్రీ అడిగింది.

వయసు ముప్పై దాటి వుంటుంది. కళ్ళు జీవంలేని గాజు గోళీల్లా వున్నాయి. నాసిరకం సిల్కుచీర కప్పిన శవంలా వుంది.

సమాధానం ఇవ్వకుండా వెళ్ళిపోతున్న రామ్మూర్తితోపాటు కొంతదూరం నడిచిందామె.

"ఓ పది వుంటే చాలు. ఆ పక్కనే గుడిశె వుంది".

"నిన్నే.. పదిలేకున్నా ఐదుంటే చాలు అన్నం తిని రెండ్రోజులైంది" దీనంగా అడుగుతోంది.

రామ్మూర్తి తలవంచుకుని వేగం పెంచాడు. ఆమె ఆగిపోయింది.

"కుర్ర పిల్ల కావాలేమో - నేను పనికొస్తానేమో చూడు" ఓ అమ్మాయి కిసుక్కున నవ్వింది.

తలయెత్తి చూశాడు రామ్మూర్తి. గడప మీద కాలుమోపి వయ్యారంగా వూపుతోన్న ఆ అమ్మాయి వేళ్ళు మడిచి - ఓ అసహ్యమైన సంజ్ఞ చేసి మరలా నవ్వింది.

రామ్మూర్తి ముందుకు నడిచాడు - వెతుకుతూ.

రకరకాల స్త్రీలు - రకరకాల వయసులు. కొంతమంది బేరాలు చేస్తున్నారు. మరికొంతమంది మగాళ్ళని ఆకర్షించటానికి హొయలు ఒలకబోస్తున్నారు.

ఆ వీధంతా అలాంటి స్త్రీలే వుంటారు. అర్థ రూపాయి నుంచి పాతిక రూపాయల వరకూ - సుఖం కొనుక్కోవచ్చక్కడ. వయసుని బట్టీ - అందాన్ని బట్టీ - ఆ వృత్తిలో సర్వీస్‌ని

బట్టి ధర నిర్ణయించబడుతుంది.

ఆలోచిస్తూ నడుస్తున్న రామ్మూర్తి ఆగిపోయాడు. చాలా నాజూగ్గా వుందా అమ్మాయి. వయసు పద్దెనిమిదిలోపే వుంటుంది. కాటుక రాసిన ఆ పెద్ద కళ్ళు వింత కాంతితో మెరుస్తున్నాయి. విల్లులా వంగిన పై పెదవి ముద్దొచ్చేలా వుంది.

ఆమె అందం కాదు రామ్మూర్తిని ఆపేసింది.

ఆమెలో నిర్లిప్తత - స్పష్టంగా కన్పిస్తున్న నిరాసక్తత - అందరిలా ఆమె వెకిలి చేష్టలు చేయడం లేదు - ఆకర్షించడానికి ఏ రకమైన కులుకూ చూపించడం లేదు - ఓ యోగిలా - విరాగిలా - విగ్రహంలా నిలబడి వుందామె.

అప్రయత్నంగా అటువైపుకు నడిచాడు రామ్మూర్తి. అతని అభిప్రాయం అర్థమైన దానిలా ఆమె గుడిశె లోపలికి దారి తీసింది. రామ్మూర్తి ఆమెను అనుసరించాడు.

లోపల ఓ మూలగా నులక మంచం మీద పల్చటి దుప్పటి కప్పి వుంది.

రామ్మూర్తి దాని మీద కూర్చున్నాడు.

"లుంగీ కట్టుకోండి" మడత పెట్టి వున్న తెల్లటి లుంగీని మంచం పైకి విసిరేసింది.

రామ్మూర్తి కదలక పోయేసరికి దగ్గరగా వచ్చింది.

"ఏం - వుండరా"

రామ్మూర్తి ఆ అమ్మాయి చేయిపట్టి తన పక్కన కూచోపెట్టుకున్నాడు.

"మొదట డబ్బులు - ఆ తర్వాతే ఏమైనా" అందా అమ్మాయి గడుసుగా.

రామ్మూర్తి యాభై రూపాయల నోటు ఆ అమ్మాయి చేతిలో పెట్టాడు

"చిల్లర వెళ్ళేటపుడు ఇస్తాను" ఆ నోటుని భద్రంగా మడిచి గూట్లో దేవుడి పటం వెనుక పెట్టింది.

"నీ పేరేమిటి?" అన్నాడు రామ్మూర్తి.

"పేరుతో మీకేం పని - పేపర్లో రాస్తారా" కొంటెగా నవ్వుతూ అందిజ

రామ్మూర్తి ఆమె ప్రతి కదలికనూ ఫాలో అవుతున్నాడు. చంచలంగా కదిలే ఆ కళ్ళు

- నవ్వేటపుడు పెదవుల చివర్ల తిరిగే సన్నటి వొంపూ - అల్లరిగా మాట్లాడేటపుడు ఆ పల్చటి నాలిక పై పెదవికి సుతారంగా తాకిస్తూ...

వచ్చి మంచంమీద కూర్చుంది. ఓ క్షణం రామ్మూర్తివైపు చూసి ఆహ్వానిస్తున్నట్టు మంచం మీద పడుకుంది.

"పేరు చెప్పనేలేదు" రామ్మూర్తి గొంతులో అందరు మగవాళ్ళలో ఆ క్షణంలో విన్పించే జీర వినిపించకపోవటంతో ఆ అమ్మాయి సమాధానం చెప్పింది.

"రాధ"

"అమ్మానాన్న పెట్టిన పేరు అదేనా"

ఆమెలో అల్లరి స్థానంలో ఆశ్చర్యం తొంగి చూసింది.

మొదటి సారి పరిశీలనగా చూసిందతనివైపు. నలభై దాటిన వయసు - అక్కడక్కడా నెరిసిన జుట్టు - మధ్య తరగతిని ప్రతిబింబించే దుస్తులూ - మొహంలో గూడుకట్టుకున్న బాధ.

"ఏం అలా అడుగుతున్నారు? మీరు కథలు రాస్తారా".

తల అడ్డంగా వూపాడు రామ్మూర్తి.

"మరి ఆలశ్యం దేనికి - రండి" అంది రామ్మూర్తి భుజంపట్టి తనవైపుకు తిప్పుకుంటూ.

రామ్మూర్తి కళ్ళలో నీళ్ళు... అనుమానంగా చూసిందతనివైపు.

"మీరు ...... మీకు.... ఆ సమస్యనా..." కళ్ళింతవి చేసి వాటినిండా నిజమైన జాలి నింపుకుని అడిగింది రాధ.

రామ్మూర్తి మాట్లాడలేదు. ఆ అమ్మాయి తలని ఒళ్ళోకి తీసుకుని ప్రేమగా జుట్టునిమిరాడు. అతని కళ్ళనుంచి ధారాపాతంగా కారుతున్న కన్నీళ్ళు...

"ఈ వృత్తిలోకి ఎలా వచ్చావు" రామ్మూర్తి గొంతు గాద్గదికమైంది

"ఎలా... ఎందుకు అనే దానికి ఒకటే సమాధానం - ఆకలి"

"అవకాశం దొరికితే ఈ వృత్తి వదిలేస్తావా?"

విస్మయంగా చూసిందతని వైపు. అతను జోక్ చేయటం లేదని సీరియస్‌గా వున్న అతని ముఖం చూస్తేనే అర్థమైందామెకు.

"తప్పకుండా వదిలేస్తాను"

"ఏం చేస్తావు?"

"నాకు టైలరింగ్ వచ్చు. అది జీవనోపాధిగా నేనెవరో తెలీని స్థలానికి వెళ్ళి కొత్త జీవితం ప్రారంభిస్తాను".

రామ్మూర్తి తృప్తిగా నిట్టూర్చాడు. అతని కేదో పెద్ద బరువు దిగిపోయినట్లుగా వుంది. తను సరియైన అమ్మాయినే ఎన్నుకున్నాడు.

జేబులోంచి డబ్బు కట్ట తీసి ఆమె చేతిలో పెట్టాడు.

"రోజుకు యిరవై రూపాయల చొప్పున సంవత్సరమంతా దాచి పెట్టిన డబ్బిది, నీకిచ్చిన యాభైతో కలిపి ఏడు వేల మూడు వందల రూపాయలు. నాయింట్లో మరో వ్యక్తి వుంటే ఆమె అవసరాల కోసం నేనెంత ఖర్చు పెట్టగలనో అంత దాచి పెడ్తాను. ప్రతిరోజూ... గత పదిహేను సంవత్సరాలుగా ఇలా చేస్తున్నాను. నీవు చెప్పినట్లు ఈ వృత్తినుంచి బైటపడటానికి నా డబ్బు నీకు ఉపయోగపడితే నేను చేసే పనికి సార్థకత లభిస్తుంది."

రామ్మూర్తి లేచి నిలబడ్డాడు.

"మీరు సంఘ సంస్కర్తలా" ఇంకా అనుమానం తీరని రాధ అడిగింది.

"కాదమ్మా - నా కంత విశాల హృదయం లేదు - నేను నా కోసం మాత్రమే బ్రతికే అతి సాదా మనిషిని, ఎటొచ్చీ నీలాంటి కూతురికి తండ్రిని" రామ్మూర్తి కళ్ళు చెమర్చాయి.

"పదిహేనేళ్ళ క్రింత రెండేళ్ళున్న నా బంగారు తల్లి తప్పిపోయింది. మంచివాళ్ళ చేతుల్లో పడివుంటే ఎక్కడో సుఖంగానే వుండి వుంటుంది, కానీ, .. ఎక్కువగా జరిగేట్లు.. దొరికిన ఆడపిల్లల్ని అమ్మేసి.." రామ్మూర్తి గొంతుకేదో అడ్డు పడినట్లయింది. మాటలు వెలికి రాలేదు. మరోసారి కళ్ళు తుడుచుకుని చెప్పాడు. "అలా జరిగి వుంటే.. నీలానే ఎక్కడో... మీలాంటి వాళ్ళతో కలిసి..."

రాధ కళ్ళలో - తనకు తెలియకుండానే కన్నీళ్ళు వచ్చాయి.

వంగి - కాళ్ళకు నమస్కారం చేసింది - నిజమైన భక్తి గౌరవంతో..

"ఈ రోజు నా కూతురు పుట్టిన రోజు.... ఎక్కడ వున్నా తను చల్లగా వుండాలి" - మనసులోనే అనుకుని "కళ్యాణ ప్రాప్తిరస్తు" అని దీవించాడు రాధని...

ఆ దీవెనకి అవాక్కయిన రాధ గమనించనేలేదు. రామ్మూర్తి తలుపు తీసుకుని - స్వాతంత్ర్యదినం సందర్భంగా ఓ ఖద్దరు లాల్చీ ఆ చౌరస్తాలో ఎగరేసిన మూడు రంగుల జెండాని దాటుకుంటూ వేగంగా వెళ్ళిపోవటం.

● *మయూరీ వీక్లీ 7 అక్టోబర్, 1994* ●